డ్యూటీ — రామమోహన రావు.

మధ్యాహ్నం రెండు గంటలయ్యింది.

విశాఖ రైల్వే ప్లాట్‌ఫారం వచ్చేపోయే రైళ్ళ రణగొణ ధ్వనులతో, ఎక్కే దిగే పాసింజర్ల హడావిడితో పెళ్ళి వారిల్లులా కళకళలాడిపోతోంది.

ఆ రోజే తన మొట్టమొదటి జీతాన్ని అందుకున్నాడు రాజారావు. జీతం తీసుకుని పర్స్‌లో పెట్టుకునేసరికి చాలా గర్వంగా ఫీలయ్యాడు. ఆ డబ్బుతో తన తల్లికి, చెల్లాయికి చీరలు కొనాలనుకున్నాడు. తన వాలుగేళ్ల మేనగోడలికి చక్కటి గౌను ఖరీదు చేయాలనుకున్నాడు.

డ్యూటీ ఎక్కి గేటు దగ్గర నిలబడ్డాడు.

అప్పుడే ప్లాట్‌ఫారం మీదికి ఓ ఎక్స్‌ప్రెస్ వచ్చి ఆగింది.

పాసింజర్స్ దగ్గర టిక్కెట్స్ కలెక్ట్ చేయసాగాడు.

రాజారావు చేస్తున్న ఉద్యోగం రైల్వేలో టిక్కెట్ కలెక్టర్. డ్యూటీ ఫస్ట్ అనే సిద్ధాంతాన్ని నమ్మే వ్యక్తి అతడు.

పది నిముషాలు గడిచేసరికి గేటు దగ్గర రద్దీ తగ్గిపోయింది.

ఎక్స్‌ప్రెస్ ఇంకా ప్లాట్‌ఫారం మీద ఆగే వుంది.

ఆ సమయంలో గేట్లోంచి ఇద్దరు పల్లెటూరి దంపతులు బయటికి వెళ్ళబోయారు.

రాజారావు వాళ్లని అడ్డగించాడు.

"టిక్కెట్లివ్వండి" అని అడిగాడు.

"ఏం టిక్కెట్లు దొరా?" తెల్లబోయి అడిగారా పల్లెటూరి దంపతులు.

వాళ్లు టిక్కెట్లు లేకుండా ఆ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణం చేశారని తలపోశాడతడు.

"ఏ వూరు మీది?" అడిగాడు.

"నాదేమో నిడదవోలండీ! నా ఆడమనిసిదేమో తాడేపల్లిగూడెమండీ!" వినయంగా చెప్పాడు భర్త.

"అవునండీ!" అంటూ వంతపాడింది భార్య.

"మీరు టిక్కెట్లు తియ్యలేదా?"

"మేమే వూరూ ఎల్లనికాడకి టిక్కెట్లెందుకు తియ్యాల్దొరా?" అమాయకంగా ఎదురు ప్రశ్న వేసిందా ఆడమనిషి.

రాజారావుకి సర్రున కోపం దూసుకొచ్చింది.

"మీలాంటోళ్లని చాలామందిని చూశాను. నా దగ్గర దొంగవేషాలెయ్యకండి. టిక్కెట్లు లేకుండా ట్రెయిన్‌లో ప్రయాణం చేసింది కాకుండా... పైగా అమాయకంగా ముఖాలు పెట్టి, ఏ వూరూ వెళ్ళ లేదని అబద్ధమాడతారా? పోనీ మీరే వూరూ వెళ్లకపోతే ప్లాట్‌ఫారం టిక్కెట్లేవీ?" గసురుతూ అడిగాడు.

"ఆవేంటిక్కెట్లో మాకు తెల్దు దొరా!" ఆ పల్లెటూరివాసి ముఖంలో నిజాయితీ కొట్టొచ్చినట్టుగా కనిపిస్తోంది.

"అవున్దొరా! ఆ టిక్కెట్లేంటో మాకు తెల్వనే తెల్వద్దొరా!" ఆమె కూడా నిజాయితీగా అంది.

"అయితే మీరిక్కడికి ఎలా వచ్చినట్టు?" చిరాగ్గా అడిగాడు రాజారావు.

"దొరా! మా వూల్లో కూలిపన్లు దొరక్క ఈడ వూర్లో ఫేక్టరీలుంటాయని, పని తేలిగ్గా దొరుకుద్దని, పొద్దుటే ఈ టేసన్లో బండి దిగినాము. సిటీ బస్సెక్కి కండక్టరు బాబుకి పైసలిచ్చి టిక్కెట్లడిగినాము. ఆ బాబు టిక్కెట్లిచ్చినాడు. బస్సులో కూకోడానికి కాలీ లేక నిలబడే వుండిపోనాము. తీరా ఫేక్టరీకాడ బస్సుదిగి సూసుకునేసరికి తెచ్చుకున్న సొమ్ములు చిక్కంతో సహా ఏటో పోనాది. ఫేక్టరీకాడ మాకు పని దొరకనేదు. ఆడనుండి ఈ టేసను దాకా నడుసుకుంటూ వచ్చి, పట్టాల సివర పైవుంటే ఆ పంవులో నీళ్లు తాగినాము. ఏ వొటేల్లోనన్నా పనిసేసి, మల్లీ మా వూరెల్లిపోవడానికి చార్జీ డబ్బులు సంపాదించుకోవాలని అనుకుంటూ మీరున్న ఈ గేటుకాడికి వచ్చినాము" దీనంగా చెప్పాడా పల్లెటూరి మనిషి.

రాజారావు కోపంతో మరింత మండిపోయాడు.

"మీ కల్లబొల్లి కబుర్లు నా దగ్గర కాదు. ఈ బండి కలకత్తా నుంచి వచ్చింది. ఒక్కొక్క టిక్కెట్టు ఖరీదు నూటేభై! ఒక్కొక్క టిక్కెట్టుకి ఫైను నూటేభై! ఇద్దరూ చెరో మూడొందలూ చొప్పున మొత్తం ఆరొందలూ కట్టండి. లేకపోతే మిమ్మల్ని జైల్లో పెట్టిస్తాను" కరుకుగా అన్నాడు.

ఆ పల్లెటూరి దంపతులిద్దరూ లబోదిబోమని గుండెలు బాదుకున్నారు.

"దొరా! మీకు మేము నిజం సెప్పినాము. మీ కాల్మొక్తాము. మమ్మల్నొగ్గేయండి దొరా! మీకు పున్యముంటాది" అంటూ దీనాతిదీనంగా వేడుకున్నారు. ఆడమనిషైతే సన్నగా రోదన కూడా ప్రారంభించింది.

"ఛీ! ఛీ! నోర్ముయ్యండి. నా దగ్గర దొంగ నాటకాలాడకండి. మర్యాదగా ఫైను కడితేనే మిమ్మల్నొదిలేది. లేదా పోలీసులకప్పజెప్పేస్తాను" కాళ్లు వెనక్కి లాక్కుని వాళ్లని గద్దించాడు రాజారావు, వాళ్లెక్కడ తన కాళ్లమీద పడిపోతారోనని.

రాజారావు కాళ్లు వెనక్కి లాక్కున్నా లాభం లేకపోయింది. ఆ పల్లెటూరి దంపతులు నిజంగానే రాజారావు కాళ్లమీద పడిపోయారు.

"దొరా! మమ్మల్నొగ్గేయండి. పొద్దున్న బండి కొచ్చినప్పుడు మా వూల్లో టిక్కేట్లు కొనుక్కునే ఎక్కినాము. అవి ఈ గేటుకాడున్న మరో దొర బాబుకిచ్చేసినాము. ఇంక మాకాడ ఇయ్యడానికి టిక్కెట్లునేవు. పైసలూ లేవు. మీ కాల్మొక్తున్నాము. మమ్మల్నొగ్గేయండి దొరా!" అతి దీనాతిదీనంగా వేడుకోసాగారా పల్లెటూరి దంపతులు.

రాజారావు కాళ్లు బలంగా వెనక్కి లాక్కున్నాడు.

"మీ అబద్ధాలు... కట్టుకథలు... కల్లబొల్లి ఏడుపులూ నా దగ్గర కాదు. మీ దగ్గర డబ్బుంటే ఆరొందలూ కట్టండి. లేకపోతే జైల్లో కూర్చోండి" అన్నాడు కటువుగా.

"మేము నిజమే సెబుతున్నాము దొరా! మాకాడ పైసా నేదు. మమ్మల్నొగ్గేయండి. మీకు పున్యముంటాది" అంటూ పదే పదే ప్రాధేయపడసాగారా దంపతులు.

రాజారావు మనసు కరగలేదు.

అటువైపుగా వస్తున్న స్టేషన్ మాస్టర్‌ని పిలిచి విషయం చెప్పాడు.

స్టేషన్ మాస్టరు రైల్వే పోలీసులని పిలిపించి, వాళ్లని పోలీసుల కప్పజెప్పేశాడు. పోలీసుల కూడా వెళ్లిపోతూ ఆ అమాయక దంపతులు రాజారావుని ఎంతో జాలిగా చూశారు. రాజారావు ఆ జాలి చూపులు పట్టించుకోలేదు. ఇంతలో ప్లాట్‌ఫారం మీదికి మరో ట్రెయిన్ వచ్చి ఆగింది.

రాజారావు మళ్లీ తన విధినిర్వహణలో మునిగిపోయాడు.

రాత్రి పది గంటలయింది.

రాజారావు డ్యూటీ దిగాడు.

స్టేషన్ పక్కనే వున్న బస్‌స్టాప్‌లోకొచ్చి నిలబడ్డాడు.

ఆఖరి ట్రిప్ సిటీ బస్సు వచ్చి స్టాప్‌లో ఆగింది.

బస్‌స్టాప్‌లో వున్న పాసింజర్స్‌తో పాటు రాజారావు కూడా తోసుకుంటూ బస్సెక్కాడు.

క్రిక్కిరిసిన జనం మధ్య కూర్చోవడానికి చోటు లేక రాజారావు నిలబడే వున్నాడు.

బస్సు ముందుకు కదిలింది.

కండక్టరు పాసింజర్సు దగ్గర టిక్కెట్సు చేస్తూ రాజారావుని టిక్కెట్టు అడిగాడు.

"పాస్" అని చెప్పాడతడు.

కండక్టరు ముందుకెళ్లిపోయాడు.

ఉద్యోగంలో చేరిన మొదటిరోజే రాజారావు బస్ పాస్ తీసుకున్నాడు.

బస్సు ఓవర్ బ్రిడ్జి దాటింది.

హఠాత్తుగా చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు బస్సుని ఆపారు.

పోలీసుల సాయంతో చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు పాసింజర్స్ దగ్గర టిక్కెట్లు చెక్ చెయ్యసాగారు.

అలా టిక్కెట్సు చెక్ చేస్తూ రాజారావుని కూడా టిక్కెట్టు అడిగారు.

అతడు 'పాస్' అని చెప్పి బాక్ పాకెట్‌లో చెయ్యి పెట్టేసరికి జేబు ఖాళీగా తగిలింది. తమ బస్సెక్కుతున్నప్పుడు పర్సెవరో కొట్టేశారు. అందులో తన మొదటినెల జీతంతో పాటు బస్‌పాస్ కూడా వుంది. ఆ పర్స్ కొట్టేసిన వాడెవడో ఈపాటికే బస్ దిగి చల్లగా జారుకుని వుంటాడు.





"నా పర్సెవరో కొట్టేసారు సార్! అందులో నా జీతం, బస్‌పాస్ కూడా వున్నాయి" దీనంగా అన్నాడు రాజారావు.

చెకింగ్ ఇన్‌స్పెక్టర్ పక్కకి తిరిగి సైగ చేశాడు. వాళ్ల కూడా వున్న కానిస్టేబుల్ రాజారావు జబ్బపట్టుకుని, బస్ దింపేసి, ప్రక్కనే వున్న సంచార న్యాయస్థానం బస్సెక్కించేశాడు.

రాజారావు దిగాలు పడిపోయాడు.

అవమానంతో అతడి ముఖం కందగడ్డలా అయింది. తన మొదటినెల జీతం పోయిందే అన్న బాధకంటే, బస్‌పాస్ పోయిందే అన్న బాధ ఎక్కువయింది.

టిక్కెట్టు లేకపోతే యాభై రూపాయలు ఫైన్ కట్టాలి. అలా ఫైన్ కట్టకపోతే పదిహేను రోజులు జైలు శిక్ష అనుభవించాలి. ఎంత అవమానం!

రాజారావు పదే పదే ఆవేదన పడిపోతున్నాడు.

సిటీ బస్సు చెకింగ్ అయిపోగానే వెళ్లిపోయింది.

చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు, పోలీసులు కలిసి సంచార న్యాయస్థానం బస్సులోనికి వచ్చారు.

"ఏంటి సార్! ఫైను కడతారా? జైల్లో కూర్చుంటారా?" రాజారావుని అడిగాడో చెకింగ్ ఇన్‌స్పెక్టరు.

"సర్! నన్ను నమ్మండి. నిజంగానే నా పర్సెవరో బస్సెక్కుతున్నప్పుడు కొట్టేశారు. అందులోనే నా జీతం, బస్‌పాస్ కూడా వున్నాయి. నేనబద్ధం చెప్పడంలేదు. నేను రైల్వేలో టికెట్ కలెక్టర్‌ని. మీలాగే నాదీ చెక్ చేసే ఉద్యోగమే. కావాలంటే మీకు ఫైన్ రేపు కట్టేస్తాను. ప్లీజ్" రిక్వెస్ట్ చేశాడు రాజారావు.

చెకింగ్ ఇన్‌స్పెక్టర్లిద్దరూ రాజారావుని ఎగాదిగా చూశారు.

అతడు తెల్లటి డ్రస్‌మీద నల్లటి కోటు తొడుక్కుని వున్నాడు. కోటు మీద అతడి పేరు వున్న నల్లటి బేడ్జి వుంది.

"మీరెంతదాకా వెళ్లాలి!" అడిగాడు ఇంకో చెకింగ్ ఇన్‌స్పెక్టర్.

"గాజువాకండీ!" చెప్పాడు రాజారావు.

"మీ మాటల్లోని సిన్సియారిటీని గ్రహించాము. మీ యూనిఫారాన్ని బట్టి మీరు రైల్వే పంప్లాయని పోల్చాము. మీ జీతము, బస్‌పాస్ పోయాయని మేము నమ్ముతున్నాము. మా మొబైల్‌వేను గాజువాక దాకా వెళుతుంది. మిమ్మల్నక్కడ దింపేస్తాము. మీరు నిశ్చింతగా ఇంటికి వెళ్లిపోవచ్చు. మీరు మాకు ఫైన్ కట్టనవసరం లేదు" అంటూ తన స్నేహహస్తాన్ని సాచి అతడికి షేక్‌హాండిచ్చాడు చెకింగ్ ఇన్‌స్పెక్టర్.

రాజారావు ఆనందానికి మేరలేదు.

"థేంక్యూ వెరీమచ్ సర్!" అంటూ చెకింగ్ ఇన్‌స్పెక్టర్లకి కృతజ్ఞతలు చెప్పకున్నాడు.

మొబైల్‌వేన్ ముందుకు కదిలింది.

రాజారావు మదిలో తను రైల్వే పోలీసులకు పట్టిచ్చిన పల్లెటూరి దంపతులు మెదిలారు.

వాళ్ల దీనాలాపనలు అతడి చెవుల్లో గింగురుమన్నాయి. పోలీసులు తీసుకుపోతూంటే వాళ్లు చూసిన జాలిచూపులు గుర్తుకొచ్చాయి. వాళ్ల మాటల్లోనూ నిజాయితీ వుందేమో! తనెందుకు గ్రహించలేకపోయాడు.

తను డ్యూటీ ఫస్ట్ అనే సిద్ధాంతాన్ని నమ్మి ఆ పల్లెటూరి దంపతులని పోలీసులకి అప్పజెప్పాడు.